
సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
మంగళవారం। 2। ఏప్రిల్। 2024



**సోమశిలలో 9.712 టీఎంసీలు**

సోమశిల: జలాశయంలో సోమవారం సాయంత్రానికి 9.712 టీఎంసీల నీరు నిల్వ ఉంది. వివిధ కాలువలకు 1,440 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు.



**బంగారం ధరలు**

| | |
|---|---|
| 24 క్యారెట్లు (10గ్రాములు) | రూ.71,160 |
| 22 క్యారెట్లు ఆర్నమెంట్ (1గ్రా) | రూ.6,356 |
| 3శాతం జీఎస్టీతో | రూ.6,547 |
| నవర (8గ్రా) | రూ.52,376 |

గరిష్టం/కనిష్టం
40.0 /26.9

**వాతావరణం**

సోమవారం గాలిలో తేమ 62 శాతం ఉంది. ఉష్ణోగ్రతలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. మంగళవారం ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరిగే అవకాశం ఉందని వాతావరణశాఖ తెలిపింది.

**రంజాన్ వేళలు**

| ఇఫ్తార్ | సహర్ |
|---|---|
| మంగళవారం | బుధవారం |
| 6:27 | 4:47 |

# వలంటీర్లపై టీడీపీ విషం

**నాలుగున్నరేళ్లుగా ఉత్తమ సేవలందించిన ప్రజా నేస్తాలు**

- టీడీపీ అనుబంధ సంస్థ ఫిర్యాదుతో సేవకు దూరం
- అవ్వాతాతలకు ఇక అగచాట్లే
- సచివాలయాల ద్వారా పింఛన్ల పంపిణీ
- చంద్రబాబు పాపానికి వృద్ధులు, దివ్యాంగులకు అవస్థలు

నిస్వార్థ ప్రజా సేవకులు వలంటీర్లపై టీడీపీ విషం చిమ్మింది. వారి సేవలను ప్రజలకు అందకుండా అడ్డుకుంది. ముఖ్యంగా పింఛన్ లబ్ధిదారులైన వృద్ధులు, దివ్యాంగులకు పెన్షన్ నగదు అందకుండా అడ్డంకులు సృష్టించింది. ప్రతి నెలా ఒకటో తేదీన ఉదయాన్నే వలంటీర్లే లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి అందించే పింఛన్ నగదును ఇక సచివాలయాలకు వెళ్లి క్యూలో నిల్చుని తీసుకోవాల్సిన దుస్థితి వచ్చింది. ఈ పాపానికి కారణమైన టీడీపీపై అవ్వాతాతలు, దివ్యాంగులతో పాటు ప్రజలంతా ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మహిళకు పింఛన్ నగదు అందజేస్తున్న వలంటీర్ (ఫైల్)

నెల్లూరు ప్రతినిధి, నెల్లూరు: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వలంటీర్ల వ్యవస్థ ద్వారా పేదలు, వృద్ధులు, దివ్యాంగులకు జరుగుతున్న మేలును చూసి ఓర్వలేని పచ్చమూక కక్ష కట్టింది. నిస్వార్థ సేవకులు వలంటీర్ల ద్వారా ప్రజలకు అందుతున్న సేవలను అడ్డుకుని తన పంతం నెగ్గించుకుంది. గత నాలుగున్నరేళ్లుగా ప్రజా నేస్తాలైన వలంటీర్లు తమ పరిధిలోని ప్రజలకు అందిస్తున్న సేవలను ఇక నిలిపివేయాలని టీడీపీ తన అనుబంధ సంస్థ ద్వారా ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదులు చేసింది. తత్ఫలితంగా ప్రతి నెలా ఒకటో తేదీ ఉదయాన్నే పింఛన్ అందుకుంటున్న అవ్వాతాతలు, దివ్యాంగులకు అవస్థలు వచ్చాయి. ఇకపై వారు సచివాలయాలకు వెళ్లి క్యూలో నిల్చుని పింఛన్ నగదు తీసుకోవాల్సి పరిస్థితి వచ్చింది. నడవలేని పరిస్థితిలో ఉన్న అవ్వాతాతలు, దివ్యాంగులకు టీడీపీ తీరని అన్యాయం చేసింది.

**ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందనే అక్కసుతో..**

గత టీడీపీ పాలనలో పింఛన్లు, రేషన్ కార్డులు, సంక్షేమ పథకాలు అందాలంటే జన్మభూమి కమిటీ సభ్యుల సిఫార్సు లేనిదే అందేవి కావు. అంతేకాక ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరగాల్సి వచ్చేది. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక గ్రామ, వార్డు సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థను ఏర్పాటు చేసి ప్రజల కష్టాలను తొలగించారు. పింఛన్లు, సంక్షేమ పథకాలు ఎలాంటి సిఫార్సులు లేకుండా పారదర్శకంగా ప్రజల ముంగిటకే అందేలా చర్యలు తీసుకున్నారు. సచివాలయాల పరిధిలో నియమించిన వలంటీర్లు తుపాన్లు, వరదలు, కరోనా విపత్తు సమయంలోనూ ప్రతి నెలా ఒకటో తేదీన ఉదయానే పింఛన్ కానుకను లబ్ధిదారులకు అందజేసి అండగా నిలిచేవారు. అనారోగ్యంతో ఆస్పత్రుల్లో ఉన్న వారికి సైతం వందల కిలోమీటర్లు ప్రయాణించి వారి వద్దకు వెళ్లి పింఛన్ నగదు అందించేవారు. అలాగే ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల ముంగిటకు చేర్చడంలో కీలకంగా వ్యవహరించారు. తమ పరిధిలోని ప్రజల సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేశారు. దీంతో ప్రజలు కూడా వారిని తమ కుటుంబ సభ్యులుగా భావించేవారు. ఇలాంటి నిస్వార్థ ప్రజా సేవకులపై టీడీపీ విషం చిమ్మింది. వలంటీర్లు అందిస్తున్న సేవల వల్ల రాష్ట్ర ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందనే అక్కసుతో ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయించింది. తత్ఫలితంగా వారి సేవలు నిలిచిపోయాయి.

**జిల్లాలో..**

వలంటీర్లు - **12,793** మంది
పింఛన్ లబ్ధిదారులు - **3.19** లక్షల మంది
ప్రతి నెలా పంపిణీ పెన్షన్ నగదు - రూ.**95.77** కోట్లు

**లబ్ధిదారుల వద్దకే వెళ్లి..**

జిల్లావ్యాప్తంగా ఉన్న 3,19,961 మంది పింఛన్ లబ్ధిదారులకు ప్రతి నెలా ఒకటో తేదీన వలంటీర్లు వారి ఇళ్ల వద్దకే వెళ్లి పింఛన్ నగదు అందించేవారు. జిల్లాలోని రూరల్ ప్రాంతంలో ఉన్న 9,112 మంది వలంటీర్లు, అర్బన్ ప్రాంతంలో ఉన్న 3,681 మంది వలంటీర్లు పింఛన్ లబ్ధిదారులకు రూ.95.77 కోట్ల నగదును పంపిణీ చేస్తున్నారు. లబ్ధిదారులు ఎక్కడ ఉంటే అక్కడికి వెళ్లి పింఛన్ ఇచ్చేవారు. టీడీపీ కక్ష ఫలితంగా వలంటీర్లు పింఛన్ల పంపిణీ దూరమయ్యారు. ఇకపై లబ్ధిదారులకు సచివాలయాల్లోనే పింఛన్ నగదు అందజేయనుండడంతో ఇకపై తమకు ఇబ్బందులు తప్పవని వారు వాపోతున్నారు. నడవలేని స్థితిలో ఉన్న తాము సచివాలయాలకు వెళ్లి క్యూలో నిల్చుని పింఛన్ ఎలా తీసుకోగలమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. టీడీపీ దాష్టీకానికి తాము ఇబ్బందుల పాలవుతున్నామని మండిపడుతున్నారు.

**దుర్మార్గమైన చర్య**



ప్రభుత్వం నాకు దివ్యాంగ పింఛన్ ఇస్తోంది. ప్రతి నెలా ఒకటో తేదీ ఉదయాన్నే వలంటీర్ మా ఇంటికే వచ్చి పింఛన్ డబ్బులు ఇచ్చేవారు. ఈ నెల పింఛన్ ఇవ్వకపోవడంతో సోమవారం వాకబు చేస్తే వలంటీర్లు పింఛన్ ఇవ్వడం లేదని, సచివాలయాల్లో ఇస్తారని చెప్పారు. పింఛన్ లబ్ధిదారులకు ఇంటి వద్దకే పింఛన్ నగదు ఇవ్వడాన్ని చంద్రబాబు అడ్డుకోవడం దుర్మార్గమైన చర్య. చంద్రబాబు తాను ఇవ్వడు. ఇచ్చే వాళ్లను ఇవ్వనివ్వడు.

– పొట్లేళ్ల వెంకట రమణమ్మ, దివ్యాంగురాలు, వలేటివారిపాళెం

**దివ్యాంగులకు ఇకపై కష్టాలు**

ఈమె పేరు షేక్ షాహీనా. ఈ దివ్యాంగురాలి వయస్సు 32 ఏళ్లు. ఈమె రెండు దశాబ్దాలుగా అనారోగ్యంతో మంచానికే పరిమితమై అన్ని సేవలకు తల్లిదండ్రులపై ఆధారపడి బతుకు వెళ్లదీస్తోంది. 80 శాతానికిపైగా శరీర అవయవాలు పనిచేయని క్రమంలో ఎన్నో అవస్థలు పడుతోంది. మందులకు సుమారు రూ.5 వేల నుంచి రూ.6 వేలు నెలకు ఖర్చు అవుతున్న నేపథ్యంలో ఈమెకు రాష్ట్ర ప్రభుత్వం ద్వారా రూ.3 వేలు పింఛన్ అందుతోంది. గత ఐదేళ్లుగా ప్రతి నెలా ఒకటో తేదీన వలంటీర్ ఇంటికే వచ్చి ఠంఛన్‌గా పింఛన్ నగదు ఇస్తుండడంతో ఎలాంటి సమస్య ఉండేది కాదు. ప్రస్తుతం చంద్రబాబు కుట్ర పుణ్యాన షాహీనాను సచివాలయానికి తీసుకెళ్లి పింఛన్ నగదు తీసుకోవాల్సిఉందని ఆమె తల్లిదండ్రులు అహమ్మద్‌బాషా – రజియా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



మంచానికే పరిమితమైన షాహీనాతో తల్లిదండ్రులు

**నిస్వార్థంగా సేవ చేశాం**



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి మేము ప్రజలకు నిస్వార్థంగా సేవ చేసే అవకాశాన్ని కల్పించారు. తద్వారా ప్రభుత్వ సంక్షేమ పథకాలను లబ్ధిదారుల ఇంటి వద్దకే అందించాం. అవ్వాతాతలకు ప్రతి నెలా వారి ఇంటి వద్దకే వెళ్లి పింఛన్ ఇస్తుండడంతో నేను ఆ కుటుంబాల్లో సభ్యురాలినైపోయాను. చంద్రబాబు వల్ల వారికి సేవ చేసే భాగ్యాన్ని కోల్పోవడం చాలా బాధగా ఉంది.

– లక్ష్మి, వలంటీర్, నెల్లూరు నగరం

**పగబట్టి ఇబ్బంది పెట్టారు**



వలంటీర్లకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన బాధ్యతను ఎంతో నిస్వార్థంగా నిర్వర్తించాం. ప్రభుత్వంపై కక్షతో ప్రజలకు సేవలందిస్తున్న మాపై పగబట్టి ఇబ్బంది పెడుతున్నారు. వలంటీర్లను ఇబ్బంది పెడుతున్న వారికి రానున్న ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెబుతారు.

– వెంకటేశ్వర్, వలంటీర్, నెల్లూరు నగరం

**పేద ప్రజలకు సేవలందిస్తున్నాం**



ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల ముంగిటకు చేరవేస్తున్న వలంటీర్ల సేవలను నిలిపివేయడం బాధాకరం. అవ్వాతాతలు, దివ్యాంగులకు ప్రతి నెలా ఒకటో తేదీ ఉదయాన్నే పింఛన్ అందించి వారి ముఖాల్లో ఆనందం చూశాం. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ద్వారా పేద ప్రజలకు సేవ చేసే భాగ్యం కలగడం చాలా ఆనందంగా ఉంది. కరోనా విపత్తు సమయంలోనూ ప్రాణాలకు తెగించి సేవ చేశాం.

– కంభటి కార్తీక్, వలంటీర్, నూతక్కివారి కండ్రిగ, చేజర్ల మండలం

**పునరాలోచించాలి**



ప్రభుత్వం మీద కోపంతో పింఛన్ మీదే ఆధారపడే వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులను ప్రతిపక్ష నాయకులు ఇబ్బందులు గురిచేస్తున్నారు. ప్రజలకు ఏ అవసరమొచ్చినా ఇన్నాళ్లు సహకారం అందించాం. ఇప్పుడు ఎవరికి ఏ ఇబ్బంది వచ్చినా ఏమీ చేయలేని పరిస్థితి. ఈ నిర్ణయంపై ఎన్నికల కమిషన్ పునరాలోచించాలి.

– తుపాకుల గిరి, వలంటీర్, సీఎం నగర్, మనుబోలు

**ఇకపై మాకు ఇబ్బందులే**



ప్రభుత్వం నాకు వృద్ధాప్య పింఛన్ ఇస్తోంది. ఇప్పటి వరకు వలంటీర్ ఇంటి వద్దకే వచ్చి పింఛన్ డబ్బులు ఇచ్చేవారు. ఇప్పుడు సచివాలయానికే వెళ్లి పింఛన్ తీసుకోవాలని చెబుతున్నారు. నడవలేని స్థితిలో ఉన్న నేను సచివాలయానికి వెళ్లి క్యూలో నిల్చుని పింఛన్ తీసుకోవాలంటే కష్టమే. ముసలోళ్లమైనమమ్మల్ని ఎందుకు ఇబ్బంది పెడుతున్నారో అర్థం కావడం లేదు.

– ఇ.బుడ కొండయ్య, దేవరాయపల్లి, అనంతసాగరం మండలం

## న్యూస్‌రీల్

### గొడౌన్‌ల వద్ద పటిష్ట భద్రత కల్పించాలి

- కలెక్టర్ హరినారాయణన్



గోడౌన్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ హరినారాయణన్

నెల్లూరు(దర్గామిట్ట): ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్లు, గోడౌన్ల వద్ద పటిష్టమైన భద్రత కల్పించాలని కలెక్టర్ ఎం.హరినారాయణన్ అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక రెవెన్యూ డివిజనల్ అధికారి కార్యాలయ ప్రాంగణంలోని ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్లు, వీవీ ప్యాడ్స్ గోడౌన్‌లను కలెక్టర్ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి పరిశీలించారు. అనంతరం నగరపాలక సంస్థ కార్యాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఎన్నికల కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను ఆయన పరిశీలించారు. కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో పనిచేస్తున్న సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆయన వెంట ఆర్డీఓ మలోల, రాజకీయ పార్టీల ప్రతినిధులు శ్రీకాంత్‌రెడ్డి, రసూల్ తదితరులు పాల్గొన్నారు.

### పది మూల్యాంకనం ప్రారంభం

నెల్లూరు(టౌన్): పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు సంబంధించిన జవాబు పత్రాల మూల్యాంకనం సోమవారం ప్రారంభమైంది. స్థానిక పొదలకూరురోడ్డులోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో మూల్యాంకనం జరుగుతోంది. తొలి రోజు 1,095 మంది సిబ్బంది మూల్యాంకనంలో పాల్గొన్నారు. అన్ని సబ్జెక్టులకు సంబంధించి 14,300 జవాబు పత్రాలను మూల్యాంకనం చేసినట్లు జిల్లా విద్యాశాఖాధికారులు చెబుతున్నారు. డీఈఓ పీవీజే రామారావు పర్యవేక్షణలో మూల్యాంకనాన్ని పకడ్బందీగా నిర్వహిస్తున్నారు.

### 3 నుంచి సచివాలయాల్లో పింఛన్ల పంపిణీ

- డీఆర్‌డీఏ పీడీ సాంబశివారెడ్డి



టెలీ కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న సాంబశివారెడ్డి

నెల్లూరు(పొగతోట): గ్రామ, వార్డు సచివాలయాల్లో ఈ నెల 3 నుంచి 8వ తేదీ వరకు పింఛన్ నగదును పంపిణీ చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని డీఆర్‌డీఏ పీడీ సాంబశివారెడ్డి మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలను ఆదేశించారు. సోమవారం నగరంలోని డీఆర్‌డీఏ కార్యాలయం నుంచి మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలతో నిర్వహించిన టెలీ కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. పింఛన్ లబ్ధిదారుల సంఖ్యకు అనుగుణంగా ఒక్కొక్క సచివాలయంలో 5 నుంచి 6 ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. లబ్ధిదారుల సంఖ్య అధికంగా ఉన్న సచివాలయంలో 7 నుంచి 8 కౌంటర్లు ఏర్పాటు చేయాలన్నారు. సచివాలయంలో ఉద్యోగులు ఉదయం నుంచి అందుబాటులో ఉండాలని ఆదేశించారు. సచివాలయాలకు రాలేని లబ్ధిదారులకు పింఛన్ నగదు పంపిణీ విషయంలో రెండు, మూడు రోజుల్లో నిర్ణయం తీసుకోనున్నట్లు తెలిపారు. పింఛన్ల పంపిణీలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. లబ్ధిదారులు సచివాలయాలకు వెళ్లి పింఛన్ నగదు తీసుకోవాలని తెలిపారు. ఎన్నికల నిబంధనలు అమలులో ఉన్నంత వరకు పింఛన్ల నగదు సచివాలయాల్లోనే పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

## చంద్రబాబుకు సంక్షేమంపై మాట్లాడే అర్హత లేదు

- వైఎస్సార్‌సీపీ నెల్లూరు ఎంపీ అభ్యర్థి వి.విజయసాయిరెడ్డి





మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నెల్లూరు ఎంపీ అభ్యర్థి వి.విజయసాయిరెడ్డి

కోవూరు: సమాజంలోని అసమానతలు రూపుమాపే లక్ష్యంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలన సాగించారని, టీడీపీ అధినేత చంద్రబాబుకు సంక్షేమంపై మాట్లాడే అర్హత లేదని రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్‌సీపీ నెల్లూరు ఎంపీ అభ్యర్థి వి.విజయసాయిరెడ్డి పేర్కొన్నారు. సోమవారం కోవూరు మండలం పడుగుపాడులో గిరిజన గ్రామాల ప్రజలతో నిర్వహించిన సమావేశంలో కోవూరు ఎమ్మెల్యే అభ్యర్థి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, ఎమ్మెల్సీ బల్లి కళ్యాణ్ చక్రవర్తిలతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా విజయసాయిరెడ్డి మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల ప్రజలకు విద్య, వైద్యం, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించి సంక్షేమ పథకాలు అందించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. పాముల పుష్ప శ్రీవాణి, రాజన్న దొరలకు మంత్రి వర్గంలో చోటిచ్చి ఉప ముఖ్యమంత్రులుగా చేశారని, పొట్లూరి స్రవంతిని నెల్లూరు కార్పొరేషన్ మేయర్‌గా చేసిన ఘనత కూడా ముఖ్యమంత్రిదేనన్నారు. రాజకీయంగా, సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన గిరిజనులను అందరితో సమానంగా అభివృద్ధి చేయడమే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. గిరిజనుల సంక్షేమం గురించి మాట్లాడే హక్కు ఒక్క వైఎస్సార్‌సీపీకే ఉందన్నారు. సామాన్యుల సంక్షేమం కోసం ఏర్పాటు చేసిన వలంటీర్, సచివాలయ వ్యవస్థలను నాశనం చేసేందుకు చంద్రబాబు ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. టీడీపీ అనుబంధ సంస్థ ద్వారా వలంటీర్లపై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసి అవ్వాతాతలకు, దివ్యాంగులకు పింఛన్లు అందకుండా అడ్డుకున్నారని తెలిపారు. చంద్రబాబు దళితులు, గిరిజనులను కేవలం ఓటు బ్యాంకుగానే ఉపయోగించుకున్నారని గుర్తుచేశారు. టీడీపీ కోవూరు అభ్యర్థి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డికి చెన్నై, ఢిల్లీ, హైదరాబాద్, విశాఖపట్నంతోపాటు ఆఫ్రికా, దుబాయి, ఇండోనేషియా, సింగపూర్‌లలో కూడా ఇళ్లు, వ్యాపారాలు ఉన్నాయని, ఆమె నెల్లూరులో ఉండరని తెలిపారు. వైఎస్సార్‌సీపీ కోవూరు ఎమ్మెల్యే అభ్యర్థి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉండే వ్యక్తి అని, రానున్న ఎన్నికల్లో కోవూరు ఎమ్మెల్యేగా ప్రసన్నకుమార్‌రెడ్డిని, నెల్లూరు ఎంపీగా తనను గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. వైఎస్సార్‌సీపీ కోవూరు ఎమ్మెల్యే అభ్యర్థి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి మాట్లాడుతూ టీడీపీ నెల్లూరు ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దయతో ఆరేళ్లు రాజ్యసభ సభ్యుడిగా కొనసాగారని, ఆయన భార్య ప్రశాంతిరెడ్డి టీటీడీ పాలకమండలిలో సభ్యురాలిగా పదవి చేపట్టారని, అయితే ముస్లిం వ్యక్తికి వైఎస్సార్‌సీపీ నెల్లూరు సిటీ ఎమ్మెల్యే అభ్యర్థిగా టికెట్ ఇచ్చారనే కోపంతో వారు పార్టీని వీడి, వెన్నుపోటు పొడిచారన్నారు. వైఎస్సార్‌సీపీ నెల్లూరు ఎంపీ అభ్యర్థి విజయసాయిరెడ్డి పేదల ప్రయోజనాలే ధ్యేయంగా పని చేస్తారని, తామెప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటామని, రానున్న ఎన్నికల్లో తనను, విజయసాయిరెడ్డి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. మేయర్ స్రవంతి మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గిరిజన సంక్షేమానికి అధిక ప్రాధాన్యం ఇచ్చారని, నెల్లూరు మేయర్ స్థానం ఎస్టీ జనరల్ అయినప్పటికీ మహిళగా తనను గౌరవించి మేయర్ పీఠంపై కూర్చోబెట్టారని తెలిపారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ నిరంజన్‌బాబురెడ్డి ఏఎంసీ చైర్మన్ రాధాకృష్ణారెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ వీరి చలపతిరావు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్లు మల్లికార్జున్‌రెడ్డి, సతీష్‌రెడ్డి, డీఎల్‌డీఏ రాష్ట్ర చైర్మన్ గొల్లపల్లి విజయ్‌కుమార్, పార్టీ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు పాలకుర్తి రవి, సొసైటీ చైర్మన్ మల్లికార్జున్‌రెడ్డి, డీఎల్‌డీఏ డైరెక్టర్ దినేష్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు .

## ఓటు హక్కు స్వేచ్ఛగా వినియోగించుకోండి

సాక్షి ఎఫెక్ట్..

ఇందుకూరుపేట: ప్రజాస్వామ్యంలో తమ ఓటు హక్కును ప్రతి ఒక్కరూ స్వేచ్ఛగా వినియోగించుకోవాలని, ప్రలోభాలకు లొంగడం రాజ్యాంగ విరుద్ధమని తహసీల్దార్ రమేష్‌కుమార్ పేర్కొన్నారు. మండలంలోని మైపాడు మజరా కృష్ణాపురంలో ఓట్లను వేలం వేయడంపై 'టీడీపీ దురాయి దురాగతం' శీర్షికతో 'సాక్షి'లో సోమవారం కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో తహసీల్దార్ రమేష్‌కుమార్, ఎంపీడీఓ సాయిలహరి, కోవూరు సీఐ ఎం.శ్రీనివాస్, ఎస్సై వీరేంద్రబాబు గ్రామంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ఓటర్లు ఎలాంటి ప్రలోభాలకు లొంగవద్దని తెలిపారు. ఓట్లను కొనడం, దురాయి కట్టుబాట్లతో గంపగుత్తగా ఒకే పార్టీకి ఓట్లు వేయడం రాజ్యాంగ విరుద్ధమన్నారు. ఓటర్లు స్వేచ్ఛగా ఓటు వేయకుండా ఆంక్షల పేరుతో ఒత్తిడి తెచ్చిన వారిపై ఎన్నికల నియమ నిబంధనల మేరకు చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా సహకరించాల్సిన బాధ్యత ప్రతి పౌరుడిపై ఉందన్నారు.



గ్రామస్తులతో మాట్లాడుతున్న తహసీల్దార్, అధికారులు


## న్యాయవాదులు కోర్టు విధుల బహిష్కరణ

నెల్లూరు (లీగల్): ఉదయగిరి బార్ అసోసియేషన్ సభ్యుడు, న్యాయవాది రాజగోపాల్‌రెడ్డిపై పోలీసుల దాడిని ఖండిస్తూ నెల్లూరు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు సోమవారం కోర్టు విధులను బహిష్కరించారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఉమామహేశ్వర్ మాట్లాడుతూ ఆదివారం ఉదయగిరి పోలీసు స్టేషన్‌లో న్యాయవాది రాజగోపాల్‌రెడ్డిపై మర్రిపాడు పోలీసు స్టేషన్ ఎస్సైతో పాటు మరో ముగ్గురు కానిస్టేబుళ్లు జరిపిన దాడిని ఖండిస్తున్నామన్నారు. చట్టాన్ని కాపాడాల్సిన పోలీసు అధికారి దాడికి పాల్పడడం గర్హనీయమని, ఎస్సైను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. కాగా మంగళవారం కూడా కోర్టు విధులను న్యాయవాదులు బహిష్కరించనున్నట్లు బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సుందరయ్యయాదవ్ తెలిపారు.

## వలంటీర్ల సేవల రద్దు దుర్మార్గం

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ పి.చంద్రశేఖర్‌రెడ్డి

నెల్లూరు(దర్గామిట్ట): రాష్ట్ర ప్రభుత్వంపై కక్షతో వలంటీర్ వ్యవస్థ ద్వారా పేదలకు అందుతున్న సేవలను టీడీపీ రద్దు చేయించడం దుర్మార్గమని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. నెల్లూరులోని మాగుంట లేఅవుట్‌లో ఉన్న వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మాజీ మంత్రి పొంగూరు నారాయణ నెల్లూరును అభివృద్ధి చేశానని అసత్య ప్రచారాలు చేసుకుంటున్నారని తెలిపారు. నారాయణ వల్ల నెల్లూరు కార్పొరేషన్ చెల్లించాల్సిన అప్పులకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం రూ.739.2 కోట్లు చెల్లించిందని తెలిపారు. గత టీడీపీ ప్రభుత్వంలో భూగర్భ డ్రైనేజీ పనులు జరిగే సమయంలో ఎంతో సాంకేతిక పరిజ్ఞానం ఉండి కూడా ఒక్క మంచినీటి కుళాయి కనెక్షన్ కూడా ఇవ్వలేకపోయారని తెలిపారు. టీడీపీ హయాంలో రోడ్ల అభివృద్ధి పనులు, మంచినీటి పథకం పనులు ఎక్కడా సక్రమంగా జరగలేదన్నారు. నారాయణ తన మెడికల్ కళాశాలను టీడీపీ ప్రభుత్వ హయాంలో అభివృద్ధి చేసుకున్నారు కానీ, నెల్లూరు నగర నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడంపై చొరవ చూపలేదని తెలిపారు. నెల్లూరును రూ.5,200 కోట్లతో అభివృద్ధి చేశానంటూ నారాయణ పుస్తకం వేసి పంచిపెట్టారని, ఆ పుస్తకంలోని వివరాలన్నీ పచ్చి అబద్ధాలని దుయ్యబట్టారు. నారాయణ నెల్లూరు నగరాన్ని అభివృద్ధి చేసినట్లు ప్రచురించిన పుస్తకంలో వాస్తవాలు ఉంటే తాను ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేస్తానని సవాల్ విసిరారు. దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలలో నెల్లూరు నగరంలో ఎంతో అభివృద్ధి జరిగిందని తెలిపారు. మోసపూరిత మాటలు మాట్లాడడం నారాయణకు వెన్నతో పెట్టిన విద్య అని దుయ్యబట్టారు. రాష్ట్ర ప్రజలకు సంక్షేమ పాలన అందిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై నారాయణ విమర్శలు చేయడం సరికాదని తెలిపారు.



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి

## నిమ్మ ధరలు (కిలో)



పెద్దవి : రూ.70
సన్నవి : రూ.55
పండ్లు : రూ.22



# కూటమిని నమ్మి మోసపోవద్దు

- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

**తోటపల్లిగూడూరు:** 'టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిని నమ్మొద్దు. వారికి ఓట్లు వేస్తే నట్టేట ముంచేస్తారు' అని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి, వైఎస్సార్‌సీపీ సర్వేపల్లి నియోజకవర్గ అభ్యర్థి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన మండలంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ముందుగా తోటపల్లిగూడూరు గ్రామానికి చేరుకున్న కాకాణికి ప్రజలు అపూర్వ స్వాగతం పలికారు. అనంతరం ఇస్కపాళెం చేరుకోగా దళితులు బ్రహ్మరథం పట్టారు. అలాగే తోటపల్లి పంచాయతీలో మంత్రికి అడుగడుగునా ఘన స్వాగతం లభించింది. ఈ సందర్భంగా గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ 2014 ఎన్నికల సమయంలో పొదుపు, రైతు రుణాలను మాఫీ చేస్తామని చంద్రబాబు నమ్మించాడన్నారు. తీరా అధికారంలోకి వచ్చాక మోసం చేశాడని చెప్పారు. 2019లో అధికారంలోకి వచ్చిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నదాతలకు పెట్టుబడి సాయం చేశారన్నారు. పొదుపు మహిళలకు అండగా నిలిచారన్నారు. అమ్మ ఒడి, విద్యాదీవెన, వసతి దీవెన తదితర పథకాలతో విద్యా రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చినట్లు చెప్పారు. దేశంలో ఎక్కడా లేని విధంగా వృద్ధులకు రూ.3 వేల పింఛన్ ఇస్తున్నట్లు వెల్లడించారు. చెప్పిన దాని కన్నా మిన్నగా ప్రజలకు సంక్షేమ ఫలాలను అందించిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని ఆదరించి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రెండోసారి సీఎంగా అవకాశం ఇవ్వాలని కోరారు.



మాట్లాడుతున్న మంత్రి కాకాణి

**అభివృద్ధి చేస్తా..**

సర్వేపల్లి నియోజకవర్గ ప్రజలు మరోసారి ఆదరించి గెలిపించాలని కాకాణి కోరారు. నియోజకవర్గాన్ని మరింతగా అభివృద్ధి చేస్తానని చెప్పారు. ఎన్నికల సమయంలో మాత్రమే దర్శనమిచ్చే టీడీపీ అభ్యర్థి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డిని నమ్మొద్దన్నారు. వైఎస్సార్‌సీపీని ఎదుర్కొనేందుకు టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిగా వస్తున్నాయని, వారిని ఓడించాలన్నారు. కూటమి అధికారంలోకి వస్తే రాష్ట్రాన్ని నాశనం చేస్తుందన్నారు. ప్రజలు ఆలోచించి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని గెలిపించాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి చిల్లకూరు సుధీర్‌రెడ్డి పార్టీ మండల కన్వీనర్ ఉప్పల శంకరయ్యగౌడ్, ఎంపీపీ ఉప్పల స్వర్ణలత, జెడ్పీటీసీ సభ్యురాలు ఎంబేటి శేషమ్మ, నాయకులు మన్నెం సుబ్రహ్మణ్యం గౌడ్, మన్నెం చిరంజీవులగౌడ్, ఈదూరు రామాచార్యులు, తాని తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

# పేదలపై కక్ష తీర్చుకున్న చంద్రబాబు

- వైఎస్సార్‌సీపీ రూరల్ అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డి

**నెల్లూరు సిటీ:** 'వలంటీర్లు పెన్షన్లు పంపిణీ చేయకుండా ఈసీ ఆంక్షలు విధించడానికి కారణం చంద్రబాబునాయుడే. పేదలపై ఆయన కక్ష తీర్చుకున్నారు' అని వైఎస్సార్‌సీపీ నెల్లూరు రూరల్ అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డి మండిపడ్డారు. నెల్లూరులోని మినీబైపాస్‌రోడ్డులో ఉన్న కార్యాలయంలో సోమవారం రూరల్ మండలం ములుమూడి గ్రామంలో టీడీపీకి చెందిన 400 మంది వైఎస్సార్‌సీపీలో చేరారు. వారికి ఆదాల పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ వలంటీర్లు పేదలకు సంక్షేమ పథకాలు అందించారన్నారు. కోవిడ్ ప్రజలకు అండగా నిలిచారన్నారు. దీంతో వారిని ప్రజలకు దూరం చేయాలని తన జేబు సంస్థల ద్వారా చంద్రబాబు కుట్రలకు తెరతీశారన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే పేదలకు మంచి చేయకుండా రాష్ట్రాన్ని సర్వ నాశనం చేస్తుందని చెప్పారు. కాగా పార్టీలో చేరిన పలువురు ముస్లింలు మాట్లాడుతూ టీడీపీ మతోన్మాద బీజేపీతో పొత్తు పెట్టుకోవడం దారుణమన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన సంక్షేమాభివృద్ధికి ఆకర్షితులై ఆదాల సమక్షంలో నాయకులు నూర్‌బాషా, సయ్యద్ మొబీనా, వేమిరెడ్డి హరిశివారెడ్డి, వేమిరెడ్డి హరికృష్ణారెడ్డి, పుచ్చలపల్లి రామ్‌ప్రసాద్‌రెడ్డి తదితరుల ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీలో చేరామన్నారు. కార్యక్రమంలో విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, రూరల్ ఎంపీపీ బూడిద విజయకుమార్, ఏఎంసీ వైస్ చైర్మన్ ఒట్టూరు సుధాకర్ యాదవ్, షేక్ రసూల్ తదితరులు పాల్గొన్నారు.



పార్టీ కండువా కప్పుతున్న ఆదాల ప్రభాకర్‌రెడ్డి

# పింఛన్లు అందకుండా టీడీపీ కుట్రలు

- వైఎస్సార్‌సీపీ ఉదయగిరి అభ్యర్థి రాజగోపాల్‌రెడ్డి

**ఉదయగిరి:** వలంటీర్లు పింఛన్లు పంపిణీ చేయకుండా టీడీపీ కుట్రలు పన్నిందని, ఇది బాధాకరమని వైఎస్సార్‌సీపీ ఉదయగిరి అభ్యర్థి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. ఉదయగిరిలోని పార్టీ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రతి నెలా ఒకటో తేదీన తెల్లవారుజామునే వలంటీర్లు అవ్వాతాతలతోపాటు దివ్యాంగులు, ఒంటరి మహిళలకు పింఛన్లు ఇచ్చేవారన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో పెన్షన్ల కోసం లబ్ధిదారులు రోజుల తరబడి వేచి చూసేవారన్నారు. ఈ దుస్థితిని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తప్పించారన్నారు. ఎన్నికల వేళ చంద్రబాబు తనకు అనుకూలమైన నిమ్మగడ్డ రమేష్ ద్వారా ఈసీకి ఫిర్యాదు చేయించి వలంటీర్లు పింఛన్లు ఇవ్వకుండా అడ్డుకున్నారన్నారు. సమావేశంలో పార్టీ మండలాధ్యక్షుడు జి.ఓబుల్‌రెడ్డి, నేతలు మూలె వినయ్‌రెడ్డి, కల్లూరి వెంకటేశ్వరరెడ్డి, కల్లూరి కృష్ణారెడ్డి, గౌస్‌మొహిద్దీన్, అక్కి భాస్కర్ రెడ్డి, అక్కుల్‌రెడ్డి, వెంకటసుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాజగోపాల్‌రెడ్డి

# సీఎం జగనన్న వెంటే జనం

- ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి

**అనుమసముద్రంపేట:** 'రాష్ట్ర ప్రజలు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెంటే ఉన్నారు. సంక్షేమ పథకాలు అమలు చేసి అండగా నిలిచిన ఆయన్ను వచ్చే ఎన్నికల్లోనూ సీఎం చేస్తారు' అని ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి అన్నారు. మండలంలోని పందిపాడు గ్రామంలో ఎమ్మెల్యే సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వంలో ఏ పథకం కావాలన్నా జన్మభూమి కమిటీ సిఫార్సు ఉండాల్సిందేన్నారు. జగనన్న వచ్చాక అర్హతే ప్రామాణికంగా కులమతాలు, రాజకీయ పార్టీలకు అతీతంగా పథకాలు అందిస్తున్నట్లు చెప్పారు. రైతులు కోరినట్లుగా సోమశిల ఉత్తరకాలువ నుంచి సాగునీటి పైపులైన్ ఏర్పాటుతో పాటు లిఫ్ట్ ఇరిగేషన్ పూర్తి చేస్తామని, 4.50 కిలో మీటర్ల మేర బీటీ రోడ్డు నిర్మాణం తప్పక చేయిస్తామని వివరించారు. అవ్వాతాతలు, దివ్యాంగులు తిరిగే అవసరం లేకుండా వలంటీర్లు ఇంతకాలం పింఛన్లు, ప్రజలకు పథకాలు అందించారన్నారు. ప్రతిపక్ష పార్టీల కుట్రల వల్ల లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నట్లు చెప్పారు. మళ్లీ జగనన్న సీఎం అయితే సంక్షేమ పథకాలు ఇంటి ముంగిటకు చేరుతాయన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ పందిళ్లపల్లి సుబ్బారెడ్డి, ఎంపీపీ బోయళ్ల పద్మజారెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు రాజేశ్వరమ్మ, జేసీఎస్ కన్వీనర్ పులిమి రమేష్‌రెడ్డి, సర్పంచ్ అల్లంపాటి కొండారెడ్డి, నాయకులు ఆదిశేషయ్య, ప్రణీత్, సూరా శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి

# మోసం చేయడమే కృష్ణ మాదిగ పని

**నెల్లూరు(వేదాయపాళెం):** మందకృష్ణ మాదిగలను మోసం చేయడమే పనిగా పెట్టుకున్నారని మాదిగ జేఏసీ నేతలు అన్నారు. నెల్లూరు జ్యోతినగర్‌లో సోమవారం మన ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు పల్లాల శ్రీనివాసులు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గత నెల 30వ తేదీన గుంటూరులో మంద కృష్ణ సభను మాదిగల జేఏసీ అడ్డుకుంటే, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని నిందించడం తగదన్నారు. ఈనెల 7న పెట్టే సభను కూడా మాదిగ జేఏసీ అడ్డుకుంటుందని హెచ్చరించారు. నవ్యాంధ్ర ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఆదూరి రత్నం మాట్లాడుతూ శింగనమల సీటును వైఎస్సార్‌సీపీ దళితుడికి కేటాయించడాన్ని చంద్రబాబు ఓర్చుకోక హేళనగా మాట్లాడారన్నారు. ఆయన మాదిగ జాతికి క్షమాపణ చెప్పాలని, లేకుంటే వచ్చే ఎన్నికల్లో గుణపాఠం చెబుతారన్నారు. బెల్లంకొండ గోపీ మాట్లాడుతూ మాదిగలను విస్మరించిన చంద్రబాబుకు మంద కృష్ణ ఎలా మద్దతు ఇస్తారని ప్రశ్నించారు. సమావేశంలో కాకులూరి శ్రీనివాసులు, పల్లాల సునీత, వన్నం కుమార్, తాళ్లూరి పృథ్వీ, ఏడుకొండలు, సుధాకర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాదిగ జేఏసీ నేతలు

## కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను పరిశీలించిన కలెక్టర్

**నెల్లూరు(బారకాసు):** కార్పొరేషన్ కార్యాలయ ప్రాంగణంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్(సీసీసీ)లోని ఎన్నికల పరిశీలన విభాగాన్ని కలెక్టర్ ఎం హరినారాయణన్ సోమవారం తనిఖీ చేశారు. ఎన్నికల పరిశీలన విభాగం సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆయన వెంట అదనపు కమిషనర్ శర్మద, పలువురు అధికారులు, సిబ్బంది ఉన్నారు.





# నగల కోసమే వృద్ధురాలి హత్య



వివరాలను వెల్లడిస్తున్న ఇన్‌స్పెక్టర్ అశోక్‌కుమార్

- ఓ మహిళ, ఆమె స్నేహితుడి అరెస్ట్
- రూ.6.15 లక్షల సొత్తు స్వాధీనం

**నెల్లూరు(క్రైమ్):** నెల్లూరు నగరంలో కలకలం రేకెత్తించిన వృద్ధురాలి హత్య కేసులోని మిస్టరీని పోలీసులు ఛేదించారు. నగల కోసమే హత్య చేసిన ఓ మహిళ, ఆమె స్నేహితుడిని అరెస్ట్ చేసి రూ.6.15 లక్షల విలువైన సొత్తును స్వాధీనం చేసుకున్నారు. సోమవారం చిన్నబజారు ఇన్‌స్పెక్టర్ బి.అశోక్ కుమార్ తన కార్యాలయంలో వివరాలను వెల్లడించారు. గూడూరు ప్రాంతానికి చెందిన లీలావతి (60), భాస్కర్‌రెడ్డి దంపతులకు ఒక కుమారుడున్నారు. ఆమె భర్త నుంచి విడిపోయి నెల్లూరులో ఒంటరిగా ఉంటోంది. సుమారు మూడునెలల క్రితం ఆమె అరవిందానగర్‌లో ఇంటిని అద్దెకు తీసుకుంది. గత నెల 23వ తేదీన లీలావతి ఇంట్లో నుంచి తీవ్ర దుర్గంధం రావడాన్ని గమనించిన చుట్టుపక్కలవారు చిన్నబజారు పోలీసులకు సమాచారం అందించారు. ఇన్‌స్పెక్టర్, ఎస్సైలు తమ సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకుని ఇంటి తలుపులు పగులగొట్టి లోనికి ప్రవేశించి చూడగా ఆమె తీవ్రగాయాలతో మృతిచెంది ఉంది. దీంతో పోలీసులు హత్య కేసు నమోదు చేశారు.

**నిందితుల గుర్తింపు**

నగర డీఎస్పీ డి.శ్రీనివాసరెడ్డి పర్యవేక్షణలో ఇన్‌స్పెక్టర్ తన సిబ్బందితో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి విభిన్న కోణాల్లో దర్యాప్తు చేపట్టారు. గతనెల 19వ తేదీన ఓ మహిళ, పురుషుడు హడావుడిగా ఘటన జరిగిన ఇంటి వద్ద నుంచి రావడాన్ని సీసీ టీవీ ఫుటేజ్‌లో గుర్తించారు. దాని ఆధారంగా మహిళను భగత్‌సింగ్‌కాలనీకి చెందిన పెంచల ప్రసన్న, మరో వ్యక్తిని ఆమె స్నేహితుడు షేక్ అజీమ్‌గా గుర్తించారు. గతనెల 31వ తేదీ చిన్నబజారు మెయిన్ రోడ్డులో నిందితులను అదుపులోకి తీసుకుని పోలీసుస్టేషన్‌కు తరలించి విచారించారు. వారిద్దరూ కొంతకాలంగా సహజీవనం చేస్తున్నారు. పెంచల ప్రసన్నకు లీలావతి బాగా తెలుసు. తరచూ ఆమె ఇంటికి వెళ్లేది. వృద్ధురాలి ఒంటిపై పెద్ద ఎత్తున బంగారు ఆభరణాలు ఉండడాన్ని ప్రసన్న గమనించింది. ఎలాగైనా వాటిని కాజేయాలని నిర్ణయించుకుని ఇదే విషయాన్ని తన స్నేహితుడికి తెలియజేసింది. దీంతో ఇద్దరూ కలిసి గత నెల 19వ తేదీన లీలావతి ఇంటికి వెళ్లి కత్తి, సుత్తితో హత్య చేసి బంగారు కమ్మలు, సరుడు, గాజులు, ఉంగరాలు, రూ.80 వేల నగదు, మొబైల్ ఫోన్‌ను దోచుకున్నారు. అనంతరం ఇంటికి తాళం వేసి పరారయ్యారు. చోరీ చేసిన సొత్తుతో మోటార్‌బైక్‌ను కొనుగోలు చేశారు. నేరం అంగీకరించడంతో పోలీసులు వారిని అరెస్ట్ చేశారు. సమావేశంలో ఎస్సైలు సుధీర్, లతీఫున్నీసా, ఏఎస్సై శ్రీహరి, హెడ్‌కానిస్టేబుళ్లు సురేష్, నరసయ్య, నజ్మల్ కానిస్టేబుళ్లు శ్యామ్, రాజా, రియాజ్, సుబ్బారావు, మహ్మద్ పాల్గొన్నారు.

## డీసీపల్లిలో 799 పొగాకు బేళ్ల విక్రయం

**మర్రిపాడు:** మండలంలోని డీసీపల్లి పొగాకు బోర్డు వేలం కేంద్రంలో సోమవారం 799 పొగాకు బేళ్లను విక్రయించినట్లు వేలం నిర్వహణ అధికారి రాజశేఖర్ తెలిపారు. మొత్తం 930 బేళ్లు వచ్చాయన్నారు. 99,345 కిలోల పొగాకును విక్రయించగా రూ.2,26,65,086ల వ్యాపారం జరిగిందన్నారు. ఒక కిలోకు గరిష్టంగా రూ.232, కనిష్టంగా రూ.220, సగటున రూ.228.14 ధర లభించిందన్నారు.

## నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్) : 133
లేయర్ (లైవ్) : 73
బ్రాయిలర్ చికెన్ : 238
బ్రాయిలర్ స్కిన్‌లెస్ : 264
లేయర్ చికెన్ : 125